సరస్వతీ పటం



కంఠంనేని రాధాకృష్ణమూర్తి

"ఈ పటం ఒక హత్యకు మరో ఆత్మ హత్యకూ కారణభూతమయిందంటే నువ్వు నమ్ముతావా ?" రామారావు అన్నాడు.

ఆ పటాన్ని చేతిలోకి తీసుకుని చూసాను. పెద్ద ప్రత్యేకత ఏమీ లేదందులో. మామూలు సరస్వతీ పటం ! అద్దం పగిలిపోయి చుట్టూ ఫ్రేము మాత్రం ఉంది వెనక ఎప్పుడో చూసాను అట్లాంటి బొమ్మల్ని, కొందరి పూజామందిరాలలోనూ, ముందుగదుల్ని అలంకరించి. అవి రవివర్మ లక్ష్మి, సరస్వతులు పటంక్రింద రంగులమధ్య ఆర్టిస్టు పేరుకోసం చూసాను గాని రవివర్మ కాదు అయితే రవివర్మ బొమ్మకు ఇది పూర్తి నకలు. వెనక కొండలు, దూరాన వాటిమీంచి దూకుతూ వస్తున్న తెల్లటి సెలయేరు అదంతా రవివర్మ లక్ష్మి చిత్రానికి ఉంచిన బాక్‌గ్రౌండు. ఏదో పెద్ద కాలెండరును చించి పటం కట్టించినట్లుంది.

"ఇది నీకెక్కడ దొరికింది ?" అడిగాను.

"ఈ ఇంట్లోనే", రామారావు అన్నాడు. "మొదట నేనీ ఇంటిని కొంటానన్నప్పుడు చాలామంది నన్ను

నిరుత్సాహపరిచారు, ఈ ఇంట్లో రెండు బలవన్మరణాలు సంభవించాయనీ, వాళ్ళ ఆత్మలు దెయ్యాలరూపంలో ఈ ఇంటి చుట్టూ తిరుగుతున్నాయనీ అంటూ పెళ్ళాం, పిల్లలతో సుఖంగా బ్రతకాలని లేదా అని బెదిరించారు నాకిట్లాంటి వాటిమీద నమ్మకంలేదు. పైగా ధరలన్నీ ఆకాశాన్నంటుతున్న ఇవాళ్టిరోజుల్లో అంత కారుచౌకలో మరో ఇల్లు దొరకాలన్నా కష్టమే అర్థంలేని సెంటిమెంట్లకు బానిసలమయి వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోవటం అవివేకమనిపించింది. అందుకే మా ఆవిణ్ణి ఎలాగో ఒప్పించి ఈ ఇల్లు కొనేసాను ఈ ఒక్క పటం తప్ప మిగతా సామానంతా ఈ ఇంటి యజమాని దాయాదులు తీసుకుపోయారు. ఈ పటం మాత్రం ఈ గదిలోనే అదుగో! అక్కడ ఆ పైన గోడకు తగిలించి ఉంది నేను తీసి అవతల పారేద్దామనుకున్నానుగాని మా ఆవిడ బలవంతంవల్ల అలాగే ఉంచేసాను. అయితే బూజుదులిపే రోజున దాన్ని కదపాల్సివచ్చింది. చానాళ్ళనుంచి గోడలను వ్రేలాడుతుంటే సామాన్యంగా పటాల వెనక తేళ్ళు, జెర్రులు లాంటివి చోటుచేసుకోవటం జరుగుతుంటుంది. ఆ భయంతో జాగ్రత్తగా పటాన్ని తిప్పి చూడబోయేసరికి దాని వెనక నుంచి మూడు నోటు పుస్తకాలు జారి క్రిందపడ్డాయి. ఆశ్చర్యంతో వాటిని ఒకోదాన్నీ తిరగేసి చూసాను అవి డైరీలు. ఇంటి యజమాని నరేంద్ర డైరీలు ఈ ఇంట్లో జరిగిన హత్యకీ ఆత్మహత్యకీ కారణాల్ని తెల్పగలిగే డైరీలు! ఇన్నాళ్ళూ లోకానికి మిస్టరీగ ఉండిపోయిన ఆ దారుణాలకి మూలం నాకొక్కడికిమాత్రమే తెలిసింది ఆ డైరీలద్వారా నేనింకెవరికీ చెప్పలేదు ఇంతవరకూ, ప్రస్తుతం ఒక్క నీకు తప్ప ..

చెప్పటం ఆపి రామారావు కొద్దిసేపు కళ్ళుమూసుకున్నాడు తనకు తెలిసిందాన్ని క్రోడీకరించటానికి ప్రయత్నిస్తున్నాడనిపించింది. ఆఖరుకు అతను కళ్ళు తెరిచాడు

అవివేకంతో కూడుకున్న విద్య మనిషికి మేలు చేయకపోగా కొన్ని సమయాల్లో చెరుపు చేస్తుందనటానికి నరేంద్రని ఉదాహరణంగా తీసుకోవచ్చు. ఈ దేశంలోని తుఘ్లక్ ప్రభువుల చేత ఏర్పరచబడి, పండిత పుత్రులచేత అంగీకరించబడ్డ చదువుల్లో ఒక పెద్ద దానిలోనే ఉత్తీర్ణుడయ్యాడు నరేంద్ర. ఆ చదువు అతనికి ఉద్యోగం సంపాదించిపెట్టలేదుగాని అతని మొహంమీద అసమర్థుడన్న ముద్రను మాత్రం వేయించి పెట్టింది. ఇది ఇలా చెరుపు చేయగా చిన్నప్పటించీ అతను చదివిన కొన్ని "నోట్ పుస్తకాలు", సుకుమాత



శావ్యాలు మొదలైనవి మనుషుల విషయంలోనూ, జీవితం విషయంలోనూ అతడిలో కొన్ని ఫాల్స్ ఇల్యూజన్స్‌ని సృష్టించి అతణ్ణి ప్రతిదానికీ బాధపడే సెన్సిటివ్ జీవిగా తయారుచేసాయి. ఫలితంగా అతని తండ్రి చనిపోయి అకస్మాత్తుగా అతను జీవితంలోకి ప్రవేశించాల్సి వచ్చేసరికి వాస్తవానుభవాలు అతడి అంచనాల్ని తారుమారుచేసి ఈ కృత్రిమ ప్రపంచము, ఇందులో కదుల్నాడే స్వార్థపూరిత సంకుచిత మనస్తత్వాలు, ఇదంతా అతడి మనస్సుకు మ్రింగుడుపడక అతణ్ణి ఉక్కిరిబిక్కిరి చేసాయి.

తండ్రి చనిపోయేనాటికి నరేంద్ర తన చదువు పూర్తిచేసి నాలుగేళ్ళు, పెళ్ళిచేసుకుని యేడాదీ అయింది. అతని తల్లి అతని చిన్నప్పుడే చనిపోయింది. అప్పట్నించీ తండ్రే అంతా తానయి పెంచాడు అతణ్ణి. ఆ తండ్రి కూడా చనిపోయి ఈ వ్యాపార ప్రపంచంలో అతనొక్కడే స్ట్రగుల్ చేయాల్సి రావటంతో అతను బొత్తిగా నిస్సహాయుడై తట్టుకోలేకపోయాడు. కనీసం అతడి భార్యన్నా అతడి ఎమోషనల్ జీవితానికి చేయూత నివ్వలేకపోవటం అతడి పరిస్థితిని మరింత దిగజార్చింది. అతని నిరుద్యోగ జీవితానికి తోటి మనుషులు సానుభూతి చూపకపోగా దాన్ని అతడి అసమర్థత క్రింద తీసుకుని వీలైనప్పుడెల్లా అతణ్ణి కించపరచటానికి ప్రయత్నించేవాళ్ళు. అతడు ఊహించిన జీవితానికి అతడు ఎదుర్కొంటున్న పరిస్థితులకి ఎక్కడా పొంతన కుదరలేదు. చెడ్డ మనుషులంటూ ప్రత్యేకంగా అతనికి ఎక్కడా కనిపించలేదు. కాని

మంచివాళ్ళుగానే ఉంటూ, బాగా దగ్గరై పదన్‌గా గుండెల్లో గ్రుద్దినవాళ్ళు ఎదు రయ్యారు. డబ్బుకోసం అడ్డమైన తక్కుర్తులూ పడే మనుషుల్ని చూసి చీదరించుకున్నాడతను మనుషుల్లో ఎక్కడా అతనికి నీతి, నిజాయితీ, ధర్మము, విశ్వాసము, ఇట్లాంటివి కని పించలేదు. లోకంలోని మనుష్యుల నిండా అతనికి తోడేళ్ళు, గుంట నక్కలు, లద్దె పురుగులు, గొంగళి పురుగులూ కనిపించాయి వాళ్ళ వాళ్ళ మనస్తత్వాల్నిబట్టి స్నేహితులుగా కనిపించినవాళ్ళు ఎక్కువమంది ఆఖరున నయవంచకులుగా, జేబులో తేళ్ళుగా తేలేవాళ్ళు అనుభవంమీద. మానవుడు తమ శరీరాల్ని, వాటి లోపాల్ని కప్పి పుచ్చుకోవటానికి అందమైన దుస్తుల్ని ధరించినట్లే తమ మనస్సుల్లోని మకిలినీ, నీచత్వాన్ని కప్పిపుచ్చటానికి తీయటి మాటల ముసుగును కప్పుకోవడం గమ నించాడు......ఎంతయినా మానవుడు సంఘజీవి. చుట్టూఉన్న మనుషుల్ని అసహ్యించుకుంటూ వాళ్ళమధ్యే బ్రత కటం అంత సామాన్యమైన విషయం కాదు. అందులోనూ నరేంద్రలాంటి సెన్సిటివ్ జీవులకు మరీ తన మనుగడ కోసం తోటివాళ్ళలో తను అసహ్యించు కునే నటనల్ని తిరిగి తనే ప్రదర్శిం చాల్సి రావటం అతనికి బాధాకరంగా అనిపించేది.

అట్లాంటి పరిస్థితిలో నరేంద్ర బయటిప్రపంచంతో సంబంధ బాంధ వ్యాల్ని ఒకటొకటిగా త్రెంచుకోవటం మొదలుపెట్టాడు. అంతవరకూ తను చేసిన ఉద్యోగప్రయత్నాలతో విసిగి వేసారిపోవటంతో ఆఖరున అతను ఆ ప్రయత్నాలు కూడా మానేసాడు. మరీ అవసరమైతేతప్ప ఇంట్లోంచి బయటికి కదలటం మానుకున్నాడు. ఒంటరిగా గదిలో కూర్చుని తను చదివిన "ఎండిమియాన్"నో, "ఎంకి పాట"ల్నో లేక "మాన్"నో జ్ఞప్తికి తెచ్చుకుంటూ, వింత వింత లోకాల్లో విహరిస్తూ ఊహా జీవుల్తో కాలక్షేపం చేస్తుండేవాడు. అలా మరో మూడేళ్ళు గడిచాయి

ఆ రకపు జీవితం నరేంద్ర మట్టుకు నరేంద్రకు సుఖకరంగానే ఉన్నా అతని చుట్టూ ఉన్న మనుష్యులమీద అది నిదానంగా తన ప్రభావాన్ని చూపిం చటం మొదలుపెట్టింది. ముఖ్యంగా అతని భార్యమీద. అప్పటికి అతనికి ఉన్న కొద్దిపాటి ఆస్తీ మరో సంపాద నంటూ లేకపోవటంతో ఇంటి ఖర్చుల క్రింద పూర్తిగా హరించిపోయింది ఇక మిగిలింది అతని భార్య తీసుకువచ్చిన కట్నం. దాన్నికూడా కదిలించక తప్ప లేదు అతని భార్యకు. నిదానంగా అందులో కూడా తొర్ర పెద్దది కావటం మొదలెట్టింది. అది గమనిస్తున్నకొద్దీ

ఆమెకు గంగవెర్రులెత్తటం ప్రారంభించింది అది కూడా అయిపోతే ఇక తమ గతేమిటి ? నరేంద్ర ఏదో బాగా చదువుకున్నాడనీ, మంచివాడనీ, పెద్ద ఉద్యోగాన్ని వెలగబెడతాడనీ తన కూతుర్నెంతో ఉద్ధరిస్తాడనీ ఆమె తండ్రి ఆమెను కట్టబెట్టాడు అయితే ఆఖరికి అతనుత్త వ్యర్థుడుగాను, నిరర్థకుడుగాను తేలాడు. దీన్ని భరించలేక పోయిందామె పైగా నరేంద్ర తానేదో ఉత్తమపురుష డన్నట్లూ, మిగతా మనుషులంతా చీమలూ, దోమలూకంటే హీనాతిహీనమైన వాళ్ళన్నట్లూ ప్రవర్తించటం ఆమెకు మరింత చికాకును కలిగించింది. తరచుగా ఆమె భర్తను సాధించటం మొదలుపెట్టింది, తోటి వాళ్ళతో అతణ్ణి పోలుస్తూ, అతని అసమర్థతను వేలెత్తి చూపెడుతూ, చెప్పేతూ ఇలా అట్లాంటి సమయాల్లో నరేంద్ర ముందు కొద్దిసేపు ఆమెతో వాదించటానికి ప్రయత్నించేవాడు. కాని అకస్మాత్తుగా అతనికి తన పరిస్థితి గుర్తుకువచ్చి చప్పున బయటికి వెళ్ళిపోయేవాడు. అట్లా వెళ్ళిపోయిన మనిషి మళ్ళీ ఎప్పటికో తిరిగి తిరిగి, భార్యకు కోపం తగ్గిపోయిందనిపించినప్పుడు ఇంటికి చేరుకునేవాడు గదిలోకి పోయి మళ్ళీ తన మామూలు మూడ్‌లోకి జారిపోయేవాడు

ఇట్లా ఉండగా ఒకరోజు అతనిభార్య ఈ సరస్వతీ పటాన్ని తీసుకువచ్చి ఇంట్లో తగిలించింది. ఆ పటం ఆమెకు బజారులో షాపింగ్ చేస్తుండగా చవకగా లభించింది ఎందుకనో ఆ పటం ఆమెను బాగా ఆకర్షించింది· ఆ పటమే తన జీవితంలో అంత పెద్ద చిచ్చుపెడుతుందని తెలిసి ఉన్నట్లయితే ఆమె దాన్ని ఖరీదుచేసి ఉండేది కాదేమో. ఇంట్లో ఉన్నది బాత్‌రూమ్‌కాక రెండే గదులు కావటంతో ఆమె దాన్ని వంటగదిలో తగిలించలేక ఇవతలి గదిలో తగిలించింది ఈ గదిలోనే నరేంద్ర ఎప్పుడూ కూర్చుని ఉండేది ఆవిడ ఎక్కువగా వంటగదిలోనో లేక పక్కఇళ్ళల్లో అమ్మలక్కలతో కబుర్లు చెబుతూనో కాలక్షేపం చేస్తుంటుంది.

మొదట్లో ఆ పటం నరేంద్ర దృష్టిని అంతగా ఆకర్షించలేదు కాని ఎందుకో ఒకరోజు అతనావేపుకు చూచినప్పుడు హఠాత్తుగా ప్రాణం లేచి వచ్చినట్లయింది. అందులో ఉపయోగించిన రంగుల కాంబినేషన్‌కీ, అక్కడ కనిపిస్తున్న వాతావరణానికీ. అప్పట్నించీ నరేంద్ర రాత్రులు నిద్రకీ, పగలు తిండికీ కాలకృత్యాలకి పోను మిగతా కాలాన్నంతా ఆ పటంలోకే చూస్తూ రోజులకు రోజులు గడపటం సాగించాడు. అందులో సరస్సు ఒడ్డున రాయి మీద కూర్చుని వీణను శృతిచేస్తున్న సరస్వతి మొహం ఎంతో అందంగా

కళ్ళల్లోంచి గొప్ప దయను కురిపిస్తూ చిత్రించబడింది ఆ మొహంలోకి చూస్తుంటే హృదయంలో ఏదో హాయి కలుగుతుండేది, ఆ పక్కనే ఉన్న దృశ్యం – ఉదయాన్ని స్ఫురింపజేసే రంగులతో సరస్సు, అందులో ఎదురు బొదురుగా ఈదుతున్న రెండు తెల్లటి హంసలు నీళ్ళలో జిగ్-జాగ్‌గా ఏర్పడిన వాటి ప్రతిబింబాలు, ఇవతల సరస్వతి పాదాలకు దగ్గరలో విచ్చుకుని చూస్తున్న కలువపూలు ఎర్రటివీ, తెల్లటివీ, అవతలగా సరస్సు ప్రారంభమవుతున్న చోట కలిసిన రెండు కొండలు వాటిమీద దూరాన ఎక్కణ్ణించో పరిగెత్తుకుంటూ వస్తున్న తెల్లటి సెలయేరు, అది సరస్సులోకి దూకుతూ సరస్సును ప్రారంభించిన చోట ఏర్పడిన నురగ చిక్కదనము, అదంతా నరేంద్ర మనస్సును జోకొట్టి, ఈ వాస్తవ వికృత లోకానికి దూరంగా అతణ్ణి ఏవేవో వింత లోకాల్లో విహరింపజేసేది ఆ సెలయేటి ఒడ్డున కొండల పచ్చదనంలోనూ, సరస్వతి వెనక చెట్ల గుబురులలోనూ వన దేవతలు సంచరిస్తున్నారనిపించేది అతనికి. ఆ సరస్సు మధ్య జలకన్యలు స్నానాలు చేస్తూ ఒకరిమీద ఒకళ్ళు నీళ్ళు చిమ్ముకుంటూ కేరింతలు కొడుతూ ఉంటారు ఎక్కణ్ణించో ఎగురుకుంటూ వచ్చిన రాయంచలు సరస్సులో వాలి పడవల్లా తేల్తూ, కదుల్తూ విన్యాసాలు చేస్తుంటాయి. సరస్వతి పాదాలవద్ద ఉన్న నెమిలి తటాలున పురి విప్పి నాట్యం ప్రారంభిస్తుంది గాలిలో పల్టీలు కొడ్తూ చెట్టు నుంచి చెట్టుకు ఎగుర్తున్న పిట్టలు ఆనందంతో కిలకిలారావాలు చేస్తుంటాయి. అక్కడ అతను అతిధి. అతని గౌరవం కోసం, అతని ఆనందంకోసం సరస్వతి చిరునవ్వుతో వీణను మీటుతూంటే ప్రకృతి పరవశంతో పులకరించిపోతుంటుంది

'భోజనానికి వస్తారా ?"

ఊహలు చెదిరిపోగా నరేంద్ర తల పక్కకు తిప్పి చూసాడు గుమ్మంలో భార్య నిలబడి ఉంది.

"నా కాకలిగా లేదు, నువ్వు చేసేయి", అన్నాడు.

"అవును, ఎట్లా ఆకలవుతుంది, కదలకుండా ఇంట్లో తిని కూర్చునే వాళ్ళకు !!" కోపంగా అందామె.

నరేంద్ర పెద్దగా బాధపడలేదు. లౌకికమైన బాధలకు అతను దాన్నాళ్ళక్రితమే అతీతుడుగ మారిపోయాడు. అతనికి తెలుసు, ఆమె గుండెల్లో మంటలు మండుతున్నాయన్న సంగతి. ఆ పూటకు ఇంట్లో తిండిగింజలు ఉన్నాయో లేవో. ఎక్కడో అప్పుతెచ్చి వండి ఉండాలామె.

భర్త మవునం ఆమెను మరీ రెచ్చగొట్టింది.



"మనుషులకు సిగ్గన్నా ఉండాలి, లేక రోషమన్నా ఉండాలి ఏమీ లేని వాళ్ళముందు ఎంత వాగితేనేమి? ఒక్కసారి బయటకుపోయి చూడండి, లోకం మన గురించి ఏమనుకుంటోందో, మీ అసమర్థత గురించీ, మీ వ్యర్థత్వాన్ని గురించీ..." అన్నదామె

"విమలా సొంత వ్యక్తిత్వమంటూ లేని ఈ మందలోని మనుషుల గురించి ఎందుకు చెబుతావు నాకు? వాళ్ళకంటే బురదలో పొర్లే పందులు, స్తుపిడిటీకి మారుపేరయిన గాడిదలూ నయం!?" అన్నాడు నరేంద్ర.

"అక్కడికి నువ్వొక్కడివే వ్యక్తిత్వంగల మనిషివన్నమాట? ఛీ, ఛీ. నీ పాలిట పడ్డందుకు నా ఖర్మ కనుకోవాలి", అందామె ఛీత్కారంతో. ఈ మధ్య కొన్ని సమయాల్లో ఆమె భర్తకివ్వాల్సిన కనీస గౌరవాన్ని కూడా మర్చిపోతోంది ఆ అవసరం కూడా కనిపించటం లేదామెకు. సంపాదన లేనివాణ్ణి కోళ్ళు కూడా తరుముతాయి.

నరేంద్ర ఏమీ మాట్లాడలేదు కొద్దిసేపు చూసి ఆమె ఒక్క విసురున అతనివద్దకు చేరుకుంది. మోకాళ్ళమీద కూర్చుని కుర్చీలో ఉన్న అతని

భుజాలు రెండూ పట్టుకుని బలంగా కుదిపింది.

"చెప్పు, చెప్పు, కనీసం ఇదన్నా చెప్పు! నువ్వసలు మనిషివేనా? నీ గుండెల్లో దయ, ప్రేమ, సానుభూతి ఇల్లాంటివి లేశమాత్రమేనా ఉన్నాయా! నేను - నేను - నీ పెళ్ళాన్ని - నన్ను నవ్వించాలనీ, సుఖపెట్టాలనీ, ప్రేమించాలనీ ఇవేమీ అనిపించటం లేదా నీకు??"

"నన్ను క్షమించు విమలా!"

ఆమె కళ్ళల్లోకి నీళ్ళుబికాయి. ఏడ్చేయటానికి సిద్ధంగా ఉందామె. భర్త నిరర్థకత్వం తోటివాళ్ళలో ఆమెను అపహాస్యం పాలుచేస్తోంది. అంతేకాక ముందుకాలం ఆమెకు మరీ అంధకారంగా, అయోమయంగా కనిపిస్తోంది. ఇట్లా ఎంతకాలమని??

నరేంద్ర దృష్టి మళ్ళీ గోడమీద పటంలోకి మళ్ళటం గమనించిందామె. వెంటనే ఒక్క ఉదుటున లేచి గోడ వద్దకు వెళ్ళింది.

"దీన్ని - దీన్ని - ముందు దీన్ని నాశనం చేస్తాను", అన్నది రొప్పుతూ, కసిగా.

"విమ్లా", నరేంద్ర లేచి నిలబడ్డాడు ఆమెను చేయిపట్టుకుని ఇవతలకు గుంజాడు. "దానిమీద చేయి వేసావంటే ... నేనేమి చేస్తానో నాకే తెలియదు", అన్నాడు. అతనిలో మానవ సహజమైన ఉద్వేగం ఏకోశానా లేదు

కొద్ది క్షణాలపాటు అతని మొహంలోకి చూస్తూ ఉండిపోయింది విమల. ఆమె కేదో అర్థమయినట్లయింది. దాచి లెంపకాయ కొట్టిం దతణ్ణి వెంటనే ఏడుస్తూ వంటింట్లోకి పారిపోయింది.

నిర్లిప్తంగా నరేంద్ర కుర్చీలోకి వాలిపోయాడు...

ఇదే రోజుల్లో అతనోసారి పేపరులో ఒక వింతవార్త చదవటం తటస్థించింది. విదేశాల్లో ఎక్కడో సముద్రం ఒడ్డున ఒక మత్స్యకన్యను పట్టుకున్నారట. ఇంటగా కనిపించిన మత్స్య పురుషుడుమాత్రం దొరక్క సముద్రంలోకి జారిపోయాడట. కాళ్ళనుంచి నడుం వరకు మానవదేహము నడుంనుంచి తలవరకు మత్స్యశరీరమూనట ఆ వింత జీవికి ఆ ఫోటో కూడా ఏదో ఉర్దూ పేపర్లో ప్రచురించబడ్డట్లు విన్నాడు ఆ వార్త నరేంద్రకు ఎంతో కుతూహలాన్నీ, వింతనూ కలిగించింది. పుక్కిటి పురాణాల్లో మత్స్యకన్యలు కాళ్ళనుంచి నడుంవరకు మత్స్యదేహంతోనూ, నడుంనుంచి తలవరకు మానవ శరీరంతోనూ ఉన్నట్లు విని ఉన్నాడతను అంతవరకూ. అందే అట్లాంటి వింతలు నిజంగా ఉన్నాయన్నమాట! అయితే మానవుడికి తెలియరాని ఇంకెన్ని వింతలు ఉన్నాయో ఈ

లోకంలో !! యక్షులు, దేవతలు, కిన్నెరలు, వాళ్ళంతా నిజంగానే ఉన్నారేమో...ఈ భావం నరేంద్ర జీవితంలో ఒక వినూత్న మలుపుకు కారణమయింది దానికి మూలం ఆ సరస్వతీ పటము ! అప్పటివరకు అతని ఆలోచనల్ని ఆ పటంలోని బ్యాగ్రౌండు దృశ్యం మాత్రమే ఆక్రమించగా ఇప్పుడు అందులోని సరస్వతీ చిత్రం అతని ఊహలకు కేంద్రస్థానమయింది.

సరస్వతి । ఆమె ధరించిన పాల నురగలాంటి పట్టుచీర, దాని అంచులకు మెరుస్తున్న బంగారు జరీ, వడిలో వీణ, వీణమీద కదుల్తున్న అందాల చేతులు, చెక్కిటి మెడనుంచి జారుతున్న ముత్యాల దండలు, మొహంలో వెల్లి విరుస్తున్న కళ, కళ్ళల్లోంచి కురుస్తున్న దయ, కిరీటం క్రిందనుంచి వీపుమీదకు జారుతున్న కేశసంపద, ఆ మోము, ఆ విగ్రహం, నిండుగా, నిర్మలంగా, ప్రశాంతంగా, సృష్టికార్యంలో పూర్తి సంతుష్టి నొందిన స్త్రీలా ఉందామె... ఈ వాస్తవ జీవితపు ఒడిదుడుకుల్ని మర్చిపోవటానికి, స్వసంతోషం కోసమూ నరేంద్ర తన ఊహాసంపదకు పదును పెట్టుకున్నాడు. అతనక్కడ ప్రకృతి వడిలోని భక్తుడు సరస్వతి అతని దేవి. ఇద్దరూ ఎనెన్నో కబుర్లు చెప్పుకుంటుంటారు వాళ్ళు నడుస్తుంటే వాళ్ళకాళ్ళక్రింద పచ్చిక మెత్తగా తల వంచుకుంటుంది పైనుంచి చెట్లు పూలను రాలుస్తుంటాయి. చుట్టూ వెన్నెల పగలబడి నవ్వుతుంటుంది. తరచుగా అతని మాటలకు సరస్వతి సన్నగా నవ్వుతుంటుంటే అతని హృదయం ఉద్వేగంతో వణుకుతుంటుంది. ఒకరోజు వాళ్లు వర్షంలో నిలబడి లోకాన్ని మూస్తున్న మబ్బుల్నీ, తడుస్తున్న కొండల్నీ, చెట్ల ఆకుల్నించి బరువుగా రాల్తున్న చినుకుల్నీ, ఇంద్రుడు ఝళిపించే వజ్రాయుధపు మెరుపుల్ని గమనిస్తూ, ప్రకృతి పాడే సంగీతాన్ని వింటూ కాలం గడుపుతారు. ఇలాగే ఒకరోజు, ఒకరోజు...

ఆ రోజు నరేంద్ర ఈ లోకం తన కివ్వలేకపోయిన ఆనందాల్ని వెతుక్కుంటూ, సంప్రదాయపు సెంటిమెంట్లను ఛేదించుకుంటూ, ఏ హైందవుడూ కలలోనైనా ఊహించ సాహసించని దూరతీరాలకు ప్రయాణంచేసాడు. ఆ రోజు అతను సరస్వతీదేవికి ఏమేమిటో చెప్పాడు. ఆమె వడిలో తలపెట్టుకుని ఏడ్చాడు. మర్త్యలోకం తనకేమీ నచ్చలేదన్నాడు. అక్కడి మనుషులంతా ఉత్త అవివేకులూ, దుర్మార్గులూ, మందమతులూ నన్నాడు. మనిషి వ్యక్తిత్వానికీ, గుణగణాలకీ కాక అతని సంపాదనకీ, సంపదకీ విలువ ఇచ్చే మూర్ఖులని చీదరించుకున్నాడు వాళ్ళ మాయలోపడి తన

భార్య తనని వేధించుకు తింటోందని ఆరోపించాడు. అతను చెప్పినదంతా సరస్వతి సాదరంగా విన్నది. ఆఖరుకి అతనివేపు చూసి దయగా నవ్వింది. అదే సమయంలో నరేంద్ర తనలో కలిగిన ఒక వింత కోర్కెను ఆమెకు వెల్లడించాడు. కోపగించుకోలేదు సర స్వతీదేవి చిన్నగా నవ్వింది. అతని హృదయం పురివిప్పి నాట్యం చేసింది. పదే పదే అతనామె పెదాల్ని చుంబిం చాడు తర్వాత ఆమెను నగ్నపరచటం మొదలెట్టాడు. ఆ ఆభరణాల్నలాగే ఉంచి, వీణను అవతలకు నెట్టి, పట్టు చీరను మెడమీంచి, గుండెలమీంచి, నడుం చుట్టూ తిప్పుతూ, వణుకుతున్న వ్రేళ్ళతో, ఉద్వేగ పూరిత హృద యంతో, వంపుల దేహాన్ని, వంకలెరు గని దేహాన్ని, అమర సహజపు మెరుపుని, ఎక్కడా గరుకులేని మృదుత్వాన్ని...

చటుక్కున ఆ ఉద్విగ్న దృశ్యం కదిలి, వణికి, నిశ్చలాన్ని సంత రించుకుని, అతనందులోంచి జారి పోయి, అది ఉత్త బొమ్మగా, పటంగా మారిపోయింది. ఈ లోకంలోకి ఊడి పడ్డాడు నరేంద్ర. అతని కెదురుగా భార్య నిలబడి ఉంది. ఆమె చేతిలో ఆ పటం ఉంది.

''విమలా !'' అరిచాడు నరేంద్ర.

ఆమె ఇంకెన్నాళ్ళో భరించలేక పోయింది,- అతని ధ్యానసంతా ఆ పటం మీదే ఉండటము, కాలమంతా అతను దానిముందే గడిపేయటము. సంపాదన లేకపోతేమానెగాని తిండి తిప్పల్నికూడా మర్చిపోయి అతనలా కృశించిపోవటము, అదంతా

"ఈ ముదనష్టపు పటాన్ని నా కొంప కూల్చుకోవటానికి తెచ్చుకున్న ట్లున్నాను," అందామె ద్వేషంగా తన చేతిలోని పటంకేసి చూస్తూ వెంటనే దాన్నామె విసిరి నేలకేసి కొట్టింది.

ఆ దృశ్యం చూస్తూనే నరేంద్ర కట్టెలా బిగుసుకుపోయాడు. క్రింద పడగానే ఆ పటం అద్దం పెద్ద చప్పు డుతో పగిలిపోయింది. పగిలిన గాజు పెంకులు చెల్లా చెదురుగా సరస్వతి మొహంమీద, శరీరమంతా చిమ్ము కున్నాయి ఆ పగుళ్ళ మధ్య సరస్వతి, తన దేవేరి, తన హృదయరాణి, వికారంగా, మొహం పగిలి, శరీరం నలిగి, కాళ్ళు విరిగి, ముక్కలై ... అంతకుముందే తనకంత గొప్ప సుఖాన్ని అందీయబోయిన హృదయ రాజ్ఞి హత్య చేయబడింది ! తన హృదయం బీటలు వారగా ఆ బీటల మధ్యనుంచి ఎవరో రంపంతో పరపరా కోస్తున్నట్లు అనుభూతి చెందాడు నరేంద్ర. ఒక్కక్షణం భార్యవేపు అసహ్యంతో కసిగా చూసాడు. వెంటనే



అతనికి తెలియకుండానే అతని శరీరం చురుగ్గా, వేగంగా కదిలింది. అతని భార్య ఏమి జరగబోతోందీ ఊహించే లోపునే అతని చేతులు రెండూ ఆమె గొంతుమీద ఉన్నాయి. ఆమె గొంతు మీద ఉన్నాయి ఆమె గొంతుమీద ఆనిన బొటనవ్రేళ్ళు రెండూ ఆమె మెడ వెనక బిగుసుకున్న మిగతా వ్రేళ్ళ వేపు కసిగా, పిచ్చిబలంతో నొక్కుకున్నాయి...

"అదే రోజు అతను ఆత్మహత్య కూడా చేసుకున్నాడు", ముగించుతూ అన్నాడు రామారావు

అంతవరకు నేనా విచిత్రగాధను ఊపిరి బిగబట్టుకుని విన్నాను. కాసేపు ఏమి మాట్లాడాలో తెలియలేదు నాకు.

"పాపం హంతకుడైనందుకు పశ్చాత్తాపంతోనూ, భార్యమీద ప్రేమ కారణంగానూ అతను ఆత్మహత్య చేసుకుని ఉండాలి", అన్నాను ఆఖరుకి.

"లేదు. అదేమీ కాదు", రామారావు అన్నాడు 'విచిత్రమేమిటంటే అప్పటికీ తాను హత్యచేసినట్లుగాని, దాని వల్ల ఏ పశ్చాత్తాపముగాని నరేంద్రలో కలగలేదు భార్య శరీరం చేతుల్లోంచి జారిపోగానే అతను అవతలికి నడిచి పటాన్ని చేతిలోకి తీసుకున్నాడు. ఉత్త అద్దమే పగిలిందిగాని సరస్వతీ చిత్రానికి ఎక్కడా ఏ డామేజీ జరగలేదు. పటాన్ని తీసుకువెళ్ళి అతను యదాస్థానంలో గోడకి తగిలించి వచ్చి తిరిగి తన కుర్చీలో కూర్చున్నాడు. అతని కాళ్ళవద్ద భార్య మృతదేహం పడిఉంది

కాని అతనికా స్పృహలేదు. అంతకు ముందు ఆఖరి క్షణంలో తను నగ్నపరిచిన సరస్వతీ దేహాన్ని కళ్ళముందు నిల్పుకోవటానికి తెగప్రయత్నించాడు. ఆ దృశ్యం పూర్తిగా అనుభవిస్తే చాలు అతనింక జీవితంలో కోరుకోదగ్గది ఏమీ లేదు కాని లాభంలేకపోయింది. అలా చాలాసేపు జరిగింది ఆ ప్రయత్నాల్లో అతను ఊపిరి బిగబట్టాడు. శ్వాసను నిదానం చేసాడు. మనస్సుకు స్ట్రెయిన్ ఇచ్చాడు. కాని అతని తెగిన ఊహలుమాత్రం ఒక్కచోటికి చేరుకోలేకపోయాయి ఆఖరుకి అతను విసిగిపోయాడు. నిరాశ చెందాడు. వాస్తవ జీవితంలో పూర్తి ఓటమిని గ్రహించిన నాడన్నా అతనంతటి నిస్పృహ చెందలేదు కసితో లేచి ఒక్క తన్ను తన్నాడు భార్య శరీరాన్ని.

"తర్వాత అతను తన డైరీని తీసుకుని ఆ సమయాన తనలో కలుగుతున్న భావసంచలనాన్ని అందులో రాసుకున్నాడు భార్యను చంపినందుకు ఏ పశ్చాత్తాపమూ కలగలేదుగాని అతనికి, సరస్వతీదేవితో కలగబోయిన "త" అనుభవాన్ని మిస్ అయినందుకు మట్టుకు ఎంతో చింతించాడు. తర్వాత అతను తీరికగా ఆ అద్దపు పెంకుల్ని ఏరి అవతల పారబోసి వచ్చాడు ఏ చప్పుడూ కాలేదు కాబట్టి బయటివాళ్ళకెవరికీ ఈ ఇంట్లో జరిగిన దారుణం గురించి తెలియరాలేదు అప్పటికి. పటాన్ని గోడమీద జాగ్రత్తగా సర్ది అతను తనకు మిగిలిన కొద్దిపాటి డైరీలనూ పటం వెనక అమర్చాడు. తర్వాత గదిమధ్య ఉరివేసుకుని చనిపోయాడు"

"విచిత్రం ! అంతేకాక నమ్మశక్యం కాకుండా కూడ ఉంది"

'అదే నాకు నచ్చదు", భుజాలెగరేసి అన్నాడు రామారావు." మన అనుభవంలోకి రానంతమాత్రాన, మన ఊహలకి అందనంత మాత్రాన నమ్మలేకపోవటం మన మూర్ఖత్వాన్ని తెలియజేస్తుంది. అందుకే గావచ్చు, శతాబ్దాల క్రితమే "హేమ్లెట్" చేత అనిపిస్తాడు మహాకవి.

"దేర్ ఆర్ మోర్ థింగ్స్ ఇన్ హెవెన్ అండ్ ఎర్త్, దాన్ ఆర్ డ్రీమ్ట్ ఆఫ్ ఇన్ యువర్ ఫిలాసఫీ!"